# వర్షం.. కష్టం

**మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు, కాలనీ, బస్తీల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతోపాటు వరదనీరు నిలిచింది.దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి.**

## రహదారులు జలమయం..గుంతలమయం





**లాలాపేట:** నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు, కాలనీ, బస్తీల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. తార్నాక చౌరస్తాలో, లాలాపేట ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ ముందు, లాలాపేట ప్రధాన రహదారి నుంచి సత్యానగర్ వెళ్లే మార్గంలో రోడ్డంతా చిత్తడిగా మారడంతో పాటు గుంతలు ఏర్పడి వర్షం నీరు నిలిచింది. మరికొన్ని ప్రాంతాల్లో మ్యాన్ హోళ్లు ధ్వంసమై రోడ్డుపై పొంగిపొర్లుతున్నాయి. దీంతో స్థానికులు ఈ రోడ్ల గుండా రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. మరి కొన్ని రోజుల పాటు ఇదే విధంగా వర్షాలు కురిస్తే మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది.

## ఇందిరానగర్‌లో జలమండలి అధికారుల పర్యటన

**సికింద్రాబాద్:** సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ, జలమండలి అధికారులు శుక్రవారం పర్యటించారు. కొంతకాలంగా తాగునీటి సరఫరాలో ప్రెషర్ తగ్గిపోతుండడం, లీకేజీల సమస్యలు పునరావృతం అవుతున్నారు. ఈ రెండు సమస్యల పట్ల స్థానికుల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతుండడంతో కార్పొరేటర్ సామల హేమ, జలమండలి డీజీఎం వై.కృష్ణ, సెక్షన్ ఆఫీసర్ అన్విత్ ఈ ప్రాంతంలో పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకోవడంతోపాటు ఫీల్డ్ ఇన్స్‌పెక్షన్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తక్షణ మరమ్మతు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.


ఇందిరానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ, డీజీఎం కృష్ణ

## ప్రజలు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి : విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్

**బన్సీలాల్‌పేట్:** వర్షాల కారణంగా ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సికింద్రాబాద్ ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ శ్రీధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో విద్యుత్తు స్తంభాలను తాకరాదని చెప్పారు. వర్షాల కారణంగా అప్పడప్పుడు ఇనుప స్తంభాలకు విద్యుత్తు సరఫరా అవుతుందని ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అటంకం కలుగకుండా తమ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. 24గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఫిర్యాదులు, సమస్యలు వచ్చినా పరిష్కరిస్తున్నామని వివరించారు. పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా రోడ్డు పక్కనున్న చెట్లు నెలకూలి విద్యుత్తు వైర్లపై పడుతుండటంతో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అయితే ఈ విషయంలో తమ సిబ్బంది సకాలంలో స్పందిస్తూ సంఘటన, సమస్యలు ఉన్న ప్రాంతానికి చేరుకొని కరెంట్‌ను పునరుద్ధరిస్తున్నట్లు తెలియజేశారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సకాలంలో పరిష్కరిస్తామన్నారు. సికింద్రాబాద్ ఏరియా పరిధిలోని తమ సెక్షన్ కార్యాలయాల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. వర్షాల కారణంగా ఉదయం వేళల్లో వాకింగ్ కోసం బయటకు వచ్చే వాకర్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఈదురు గాలులు, వర్షాలకు చెట్లు విద్యుత్తు వైర్ల మీద పడినప్పుడు చూసుకోకుండా అటువైపు వెళ్లరాదని సూచించారు.

## బేగంపేటలో కూలిన ప్రహరీ

**సనత్‌నగర్:** బేగంపేట నాలా పరివాహక ప్రాంతాలైన మయూరిమార్గ్, అల్లంతోటబావి, వడ్డరబస్తీ, బ్రాహ్మణవాడీ, చీకోటి గార్డెన్, ప్రకాష్‌నగర్ ప్రాంత ప్రజలు వరద ముంపు భయంతో వణుకుతున్నారు. బేగంపేట వడ్డెర బస్తీలో పురాతన ప్రహరీగోడ నేలమట్టం అయ్యింది. అయితే ఆ సమయంలో అటువైపుగా ఎవరూ వెళ్లకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.



## వరద నీరు నిలువకుండా చర్యలు తీసుకోండి


వరద నీరు నిలిచే ప్రాంతాలను సందర్శిస్తున్న మాజీ కార్పొరేటర్

**అమీర్‌పేట:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అధికారులను కోరారు. భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిలిచిపోయి ఉన్న బౌద్ధనగర్, గాయత్రీనగర్ ప్రాంతాలను శుక్రవారం సందర్శించారు. కొన్ని చోట్ల మ్యాన్ హోల్స్ వద్ద వ్యర్థాలు,బురద పేరుకుపోయి నీరు నిలిచి పోయినట్లు గుర్తించారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ జమీల్‌కు పరిస్థితినిక వివరించారు. అక్కడికి వచ్చిన సిబ్బంది వ్యర్థాలను తొలగించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు సుమిత్‌సింగ్, నర్సింహ, బలరాం, రాజు ఉన్నారు.

## వరదనీటిని పరిశీలించిన తహసీల్దార్

**రసూల్‌పురా:** రసూల్‌పురా నాలా పరివాహక ప్రాంతాల్లో ఉంటున్న పేదలకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు సికింద్రాబాద్ మండల తహసీల్దార్ శైలజ తెలిపారు. శుక్రవారం రసూల్‌పురాలోని శ్రీలంక బస్తీ, మహమ్మదీయ నగర్, 105 గల్లీ, ఇంద్రమ్మనగర్ బస్తీలో తహసీల్దార్ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. బస్తీవాసులతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నాలలో వరద నీటి ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో సిబ్బందిని అప్రమత్తం చేశామని బోర్డు అధికారులతో సమన్వయం చేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు షేక్ నయిం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


బస్తీవాసులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శైలజ

## కంట్రోల్ రూంకు ఫోన్ చేయండి : డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి


ఫిర్యాదులను సమీక్షిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**లాలాపేట:** నగరంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల తలెత్తే సమస్యలపై ప్రజలు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు నెంబర్ 040-21111111 లేదా 100కు ఫోన్ చేయాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. అంతేకాక డయల్ చేసి లేదంటే మై జీహెచ్ఎంసీ యాప్ ద్వారా తెలియజేయాలనీ జీహెచ్ఎంసీ ఇక్కడ సంబంధిత ఉన్నతాధికారులు అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూంను సందర్శించారు. కంట్రోల్ రూంలో అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు ఎలాంటి పరిష్కారం చేస్తున్నారు అనే అంశాలపై సమీక్షించారు. స్వయంగా డిప్యూటీ మేయర్ సైతం కొంత సమయంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తెలుసుకుని వాటికి పరిష్కారాలను చూపించారు. జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డి అనురాధ, ఇతర విభాగాల అధికారులు ఉన్నారు.

## ముంపు బాధితులకు అండగా ఉంటాం

**కంటోన్మెంట్:** భారీ వర్షాల నేపథ్యంలో సమస్యల్లో ఉన్న ప్రజలకు తక్షణ సాయం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ మర్రి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మాజీ బోర్డు సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి ఆరోవార్డు పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. రామన్నకుంట ముంపు ప్రభావిత కాలనీలతో పాటు జయానగర్, సెయిల్ కాలనీల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. బోర్డు అధికారులు ముంపు ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముంపు సమస్యలు తీవ్రంగా ఉంటే బాధిత ప్రజలు నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సుందర్ సింగ్, పార్టీ నేతలు ,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మర్రి, పాండుయాదవ్

## క్లుప్తంగా...

### ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ.63, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 85, క్యాప్సికమ్ 75, పచ్చకాకర 32, పందిరి బీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 55, దొండ 13, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 65, గోకరకాయ 23, కీర 11, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

### వర్గీకరణ పోరాటానికి సిద్ధం కావాలి

**బౌద్ధనగర్:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకునే ఆశయ సాధనలో అంతిమ యుద్ధానికి మాదిగ సమాజం సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రాగటి సత్యం మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ కేంద్ర కార్యాలయంలో సికింద్రాబాద్ కోఆర్డినేటర డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ నేతలు ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాటలు చెబుతున్నారే కాని చేతల్లో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు.

### కిషన్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు



**సనత్‌నగర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన జి.కిషన్‌రెడ్డికి బీజేపీ ఎస్టీ మోర్చా మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. కిషన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ విజయదుందుభి మోగించనున్నదని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

#### మాజీ మేయర్ శుభాకాంక్షలు




**లాలాపేట:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బీజేపి రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొన్నె సంపత్, భూపాల్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

### విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

**కంటోన్మెంట్:** ఎస్సీ వర్గీకరణ సాధన లక్ష్యంగా ఆగస్టు రెండో వారంలో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇటుక శ్రీకిషన్ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నేత అజిత్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఒకటో వార్డు ఎమ్మార్పీస్ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకిషన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతటి త్యాగానికైనా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రాగటి సత్యం మాదిగ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ మాదిగ పాల్గొన్నారు.

### తలసేమియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం


ప్రముఖ గైనకాలజిస్ట్ బాలంబకు జ్ఞాపికను అందజేస్తున్న టీఎస్‌సీఎస్ ప్రతినిధులు

**అమీర్‌పేట :** తలసేమియా వ్యాధిపై అవగాహన పెంచడంతో పాటు తలసేమియా రహిత సమాజ నిర్మాణం దిశగా అడుగులు వేద్దామని ప్రముఖ వైద్య నిపుణులు, పరిశోధకులు పిలుపునిచ్చారు. టీఎస్‌సీఎస్, మర్గం ఎన్జీవో సంయుక్త ఆధ్వర్యంలో తలసేమియా స్క్రీనింగ్‌పై సింపోజియం చర్చా కార్యక్రమం శుక్రవారం అమీర్‌పేట గ్రీన్‌పార్కు మ్యారీగోల్డ్ హోటల్‌లో నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక కుటుంబాలను వ్యాధి పట్టి పీడిస్తోందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రసూతి వైద్య నిపుణులు మంజులా అనగాని,రమణ దండముడి అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌సీఎస్,మర్గం ఎన్జీవో సంస్థ ప్రతినిధులతో పాటు వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి శ్రావణ మాస బోనాల జాతర

**రసూల్‌పురా :** కంటోన్మెంట్‌లో ప్రసిద్ధి చెందిన బాలంరాయి శ్రీ దేవి దండుమారమ్మ ఆలయ శ్రావణ మాస బోనాల జాతర ఆది, సోమవారాల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ తెలిపారు. శుక్రవారం ఆలయ ఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆదివారం ఉదయం అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, అభిషేకం, సహస్రనామార్చన, మంగళ హారతి, మంత్రపుష్పం అనంతరం బోనం సమర్పణ సాయంత్రం ఆరుగంటల నుంచి ఫలహార బండ్ల. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, పెరుమాళ్ ఆలయ కమిటీ సభ్యులు సురేష్, నరేష్, స్థానికులు రమేష్, శ్రీను, హీరాలాల్, సాయికిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బోనాల జాతర వివరాలు వెల్లడిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్ శర్మ

## మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

**లాలాపేట:** మణిపూర్ రాష్ట్రంలో మహిళల నగ్న ఊరేగింపు మోదీ ప్రభుత్వపు దుర్మార్గపు చర్య అని దీనికి కేంద్రంలోని మోదీ సర్కార్ పూర్తి బాధ్యత వహించాలని ఓయూలోని పలు విద్యార్థి సంఘాల నేతలు అన్నారు. వెంటనే ఆ రాష్ట్రంలో విధ్వంసకాండను ఆపి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలను నిలువరించడంలో విఫలమైన ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. దానికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలనీ డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ కోరారు. కార్యక్రమంలో గిరిజన శక్తి, ఏఐఎస్ఎఫ్, డీబీఎస్ఏ, టీఆర్ఎస్వీ, పీడీఎస్‌యూ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.


ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

## యువత అడ్డాలు కేఫ్‌లు

**కంటోన్మెంట్:** హైదరాబాద్ యువతకు 'కేఫ్'లకు విడదీయలేని అనుబంధం ఉంటుందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. ముఖ్యంగా నగరంలోని కేఫ్‌లు యువత చర్చావేదికలుగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయి అన్నారు. ఈ నేపథ్యంలోనే తాను స్థానిక యువత ఆకాంక్షలు తెలుసుకునేందుకే కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమం ప్రారంభించానని అన్నారు. వారానికో కేఫ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా 11వ కేఫ్ పాలిటిక్స్‌ను చారిత్రాత్మక డైమండ్ పాయింట్ కేఫ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిశాంక్ సుమారు 50 మంది స్థానిక యువకులతో భేటీ అయ్యారు. బహుళ జాతి సంస్థల్లో యువత పాత్రపై ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో విజయ్, గోపి, జె.శ్రీకాంత్, సాయి, యశ్వంత్, నరేష్, పరశురాం, కరుణాకర్, పాషా తదితరులు పాల్గొన్నారు.



డైమండ్ పాయింట్ కేఫ్‌లో యువతతో మాట్లాడుతున్న క్రిశాంక్

## శిథిలావస్థలో నిజాం కాలం నాటి నిర్మాణం

**లాలాపేట:** లాలాపేటలోని నిజాం కాలం నాటి పాత నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. లాలాపేట, శాంతినగర్ ప్రాంతాలలో ఉన్న బుర్జులు, పెద్ద పెద్ద దర్వాజలు వంటి పలు నిర్మాణాలకు పగుళ్లు ఏర్పడి, పెచ్చులూడి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో నగరంలో గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పాత కాలం నాటి నిర్మాణాలు తడిసిపోయాయి. మరి కొన్ని రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని ఒక వైపు వాతావరణ శాఖ చెప్తూనే ఉంది. దీంతో ఈ నిర్మాణాలకు రక్షణ చర్యలు తీసుకోవాలనీ లాలాపేట వాసులు కోరుతున్నారు. లేదంటే చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న ఈ ఆనవాళ్లు కనుమరుగైయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కావునా అధికారులు వెంటనే స్పందించాలనీ లాలాపేట వాసులు అంటున్నారు.


లాలాపేటలో శిథిలావస్థలో ఉన్న నిజాం కాలం నాటి ఆర్చ్

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**సనత్‌నగర్:** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ఎస్ఐ గంగాధర్ తెలిపిన మేరకు.. బేగంపేట హెచ్‌పీఎస్ పాతబావి గేట్ ప్రాంతంలో ఓ వ్యక్తి తలకు గాయమై చెవుల నుంచి రక్తం కారుతూ కిందపడి ఉండడాన్ని అక్కడే విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్ లింగంపల్లి నర్సింహాచారి గమనించాడు. ఈ సమాచారాన్ని ఎస్టేట్ మేనేజర్ ప్రణీత్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ప్రణీత్..108 వాహన సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన ప్రాంతానికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుని సంబంధీకులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని గంగాధర్ కోరారు.

## పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

**అడ్డగుట్ట:** అర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుకారాంగేట్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ తెలిపిన మేరకు.. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన హరనాథ్(38) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన హరనాథ్ కొంతకాలంగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ నెల 20న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అనంతరం హరనాథ్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో అలస్యంగా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## వర్షం ధాటికి 5 గుడిసెలు నేలమట్టం



**అడ్డగుట్ట:** మొండిబండా నగర్ బస్తీలో శుక్రవారం వర్షం ధాటికి అయిదు గుడిసెలు కుప్పకూలాయి. ఈ సమయంలో వీటి గుడిసెవాసులు పను ల నిమిత్తం బయటికి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. రైల్వే అధికారులు నిర్మించిన ప్రహరీ సైతం కూలిపోయింది. ఒక పక్క వర్షం మరో పక్క కూలిపోయిన గుడిసెల మధ్య బస్తీవాసుల కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. గుడిసెలు కూలిపోయిన బాధితులు పక్కన ఉన్న గుడిసెల్లో తలదాచుకున్నారు. ఇక్కడ సుమారు 40 గుడిసెల్లో పేదలు నివసిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరుతున్నారు.

## కట్టమైసమ్మ ఆలయ నిర్వాహకులకు సన్మానం

**చిలకలగూడ :** చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ బోనాల జాతరను విజయవంతంగా నిర్వహించిన ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులకు స్థానిక భక్తులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు మహేందర్‌ముదిరాజ్, నాగేందర్, కోట మురళీ, నాగేశ్వరరావు, మమ్మీకాకా, ప్రభు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కట్టమైసమ్మ ఆలయ నిర్వాహకులను సన్మానిస్తున్న దృశ్యం

## పారిశుద్ధ్య కార్మికులకు గొడుగులు పంపిణీ


గొడుగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

**సనత్‌నగర్:** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ నేత రవీందర్‌గౌడ్ పారిశుద్ధ్య కార్మికులకు గొడుగులను పంపిణీ చేశారు. రాంగోపాల్‌పేట డివిజన్ శ్రీకట్టమైసమ్మ పోచమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో దాదాపు వంద మంది జీహెచ్ఎంసీ సిబ్బందికి గొడుగులు అందజేశారు. రాంగోపాల్‌పేట డివిజన్ నాయకులు మనోజ్, కుమార్, సాయి, సనత్‌నగర్ డివిజన్ నేతలు రమేష్, కమల్‌రాజ్, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

**రాంగోపాల్‌పేట్:** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదినం సందర్భంగా శుక్రవారం మినిస్టర్‌రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్ జీహెచ్ఎంసీ స్వీపర్లు, ఎలక్ట్రికల్ సిబ్బందికి గొడుగులు పంపిణీ చేశారు.

## కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి

**సనత్‌నగర్:** కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేసి అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద శుక్రవారం రామచంద్రయ్యకు వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరు కాగా, సాయికిరణ్‌యాదవ్ ఆయన కుమారుడు సురేష్‌కు చెక్కును అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేవిధంగా అనేక చర్యలు చేపట్టిందన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న తలసాని సాయికిరణ్‌యాదవ్

## సామాజిక సేవ అధ్యయన రంగంలో మార్పులను అనుసరించాలి

**రసూల్‌పురా:** సామాజిక సేవ అధ్యయన రంగంలో వస్తున్న మార్పులననుసరించి ఆ అంశంపై బోధిస్తున్న అధ్యాపకులు మార్పులను సునిశితంగా పరిశీలించాలని పద్మశ్రీ డాక్టర్ పి. హన్మంతరావు సూచించారు. సికింద్రాబాద్ పీజీ కళశాలలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.అర్జున్‌రావు నేతృత్వంలో డిపార్టమెంట్ ఆఫ్ సోషల్ వర్క్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు కార్యక్రమానికి హన్మంతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, సామాజిక సేవ అధ్యయన రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడా నికి కావలసిన నైపుణ్యాలను అధ్యాపకులు పెంపొందించుకోవాలని కోరారు. తెలంగాణ బాలల హక్కుల సంక్షరక్షణ సమితి చైర్మన్ జోగినపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. సోషల్‌వర్క్ విద్యా వ్యవస్థలో ఉత్పన్నం అవుతున్న వివిధ సామాజిక సమస్యలు వాటిని అధిగమించే అవసరమైన చర్యలు తీసుకునే జాగ్రత్తలను గురించి వివరించారు. ప్రముఖ పర్యావరణ వేత్త కే. పురుషోత్తం రెడ్డి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న డా.హన్మంతరావు